

ప్రాణాలు పోతున్నాయ్

ఆఫ్‌షోర్ కాలువ ప్రమాదకరంగా మారుతోంది. ఏటా ప్రాణాలు పోతున్నాయి.

- 8లో



రోడ్డు ప్రమాదంలో..

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సీతంవలస సమీపంలో ఘటన జరిగింది.

- 8లో



మహాలడ్డూ @ రూ.2.20లక్షలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని విజయగణపతి దేవాలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మహాలడ్డూ వేలం వేశారు. వేలంలో లడ్డూను రూ.2.20లక్షలకు నగరానికి చెందిన గీతాంజలి స్కూల్ నిర్వాహకులు కొనుక్కున్నారు.

అభివృద్ధి వద్దు ▸ వివాదాలే ముద్దు



- వివాదంలో మరో టీడీపీ ఎమ్మెల్యే
- ఈ సారి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వంతు
- వరుసగా చోటు చేసుకుంటున్న వివాదాలతో టీడీపీలో కలకలం
- రోడ్డు అవినీతిని ప్రశ్నించినందుకు హత్యాయత్నం చేశారంటున్న శ్రీముఖలింగం అర్చకుడు
- నేరుగా ఢిల్లీలో రాష్ట్రపతికి, జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు
- బగ్గు రమణమూర్తితో ప్రాణహాని ఉందన్న అర్చకుడు రాజశేఖర్



జాతీయ మానవ హక్కుల కమిషన్ కార్యాలయం ముందు ఫిర్యాదు కాపీని చూపిస్తున్న నాయుడి గారి రాజశేఖర్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

సిక్కోలు ఎమ్మెల్యేల వ్యవహార శైలి అంతటా చర్చనీయాంశమవుతోంది. జిల్లాలో చేస్తున్న అభివృద్ధి ఏమీ లేకపోయినా తమ వివాదాస్పద వైఖరితో రాష్ట్రవ్యాప్తంగా సంచలనాలు రేపుతున్నారు. మొన్నటి వరకు పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్, దళిత మహిళను వేధింపులకు గురి చేశారన్న అభియోగంతో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ వివాదం నడవగా, ఆ తర్వాత మంత్రి అచ్చెన్నాయుడు పేషీలో పనిచేస్తున్న ఓఎస్డీ ఒకరు యంత్రపరికరాల కంపెనీతో కమీషన్ల మధ్యవర్తిత్వం నెరపాలన్న కోరికను తిరస్కరించినందుకు తనను అన్యాయంగా బదిలీ చేశారని ఆరోపిస్తూ ప్రిన్సిపాల్ సెక్రటరీకి ఆగ్రోస్ జనరల్ మేనేజర్ ఫిర్యాదు చేసిన వ్యవహారం చిచ్చు రేపింది. వీరిద్దరి తర్వాత తాజాగా నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వ్యవహారం తెరపైకి వచ్చింది. ఆయన అనుచరులు తనపై హత్యాయత్నానికి దిగారని, ఎమ్మెల్యే బగ్గుతో తనకు ప్రాణహాని ఉందని ఏకంగా రాష్ట్రపతికి, జాతీయ మానవ హక్కుల సంఘానికి నరసన్నపేట నియోజకవర్గం శ్రీముఖలింగం ఆలయ అర్చకుడు నాయుడిగారి రాజశేఖర్ ఢిల్లీ వెళ్లి ఫిర్యాదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

వివాదాస్పదం


జిల్లాలో తరచూ వివాదాస్పదమవుతున్న ఎమ్మెల్యేల్లో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఒకరు. మద్యం షాపుల లీజుల టెండర్ల సమయంలో తన నియోజకవర్గంలోని షాపులన్నీ తన గుప్పెట్లో ఉండేలా చేసిన యత్నాలు జిల్లా వాసులంతా చూశారు. చివరికి సొంత పార్టీ కార్యకర్తలు, నాయకులు కూడా అక్కసు వెళ్లగక్కే వరకు పరిస్థితి వెళ్లింది. తన కనుసన్నల్లోనే నియోజకవర్గంలో ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు జరిపించారన్న వాదనలు ఉన్నాయి. ఈ క్రమంలో ఎల్లో మీడియాకు చెందిన ప్రతినిధులపై ఇసుక మాఫియా దాడులు చేయడం కూడా చర్చనీయాంశమైంది. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లో కుటుంబ సభ్యులు అంతా తామై వ్యవహరించడం నియోజకవర్గం టీడీపీ శ్రేణుల్లో కాకరేపింది. ఇక బగ్గు రమణమూర్తి పీఏ గణపతి వ్యవహారమైతే మరింత వివాదాస్పదమైంది. ఎమ్మెల్యే అండ చూసుకుని ప్రైవేటు పీఏ రెచ్చిపోయి, చేసిన నిర్వాకాలు రచ్చరచ్చ చేశాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కేంద్రంగా ఎన్నో ఆరోపణలు, మరెన్నో అక్రమాలు చోటు చేసుకున్నాయి.

ఢిల్లీకి చేరిన ఫిర్యాదులు

అవినీతి అక్రమాలపై బగ్గుపై ఎన్నో ఆరోపణలు ఇదివరకు ఉన్నాయి. తాజాగా శ్రీముఖలింగం కరకట్టపై సుమారు రూ.కోటి ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న పనుల డొల్లతనాన్ని శ్రీముఖలింగం ఆలయం అర్చకుడు నాయుడిగారి రాజశేఖర్ బయటపెట్టారు. అంతటితో ఆగకుండా ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డులో అవినీతి జరిగిందనీ, రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై అక్కసుతో కొందరు ఆయనపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఎమ్మెల్యేకు చెందిన ఎనిమిది మంది అనుచరులు దాడి చేశారని నాయుడుగారి రాజశేఖర్ గత నెల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, ఎమ్మెల్యే ఒత్తిడితో పోలీసులు కూడా తేలికపాటి సెక్షన్లతో కేసు నమోదు చేశారని రాజశేఖర్ ఆరోపిస్తున్నారు. ఇక్కడ న్యాయం జరగదని భావించి నేరుగా ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతికి, జాతీయ మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. తనకు ఎమ్మెల్యేతో ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది.

ఇదేం తీరు..?

జిల్లాకు ఎమ్మెల్యేల తీరును స్థానికులు ఏవగించుకుంటున్నారు. సాధారణంగా మంత్రులు, ఎమ్మెల్యేలపై ఫిర్యాదులు చేయడానికి ఎవరైనా భయపడతారు. బాధితులైతే మరింత వెనక్కి తగ్గుతారు. కానీ టీడీపీ అధికారంలో ఉండగా, రాష్ట్రంలో ఎక్కడికక్కడ ప్రశ్నించే వారిపైన దాడులు చేసి, కేసులు పెడుతూ వేధిస్తున్న క్రమంలో బాధితులు బయటకు రావడం చర్చనీయాంశంగా మారుతోంది. నేరుగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేస్తున్నారంటే బరితెగింపు పతాక స్థాయికి చేరిందని అర్థమవుతోంది.



ఫిర్యాదు నకలు

మూలపేట పోర్టు పనులు ఏమవుతున్నాయో తెలీదు.. ఉద్దానం ప్రాజెక్టు సంరక్షణ ఎలా ఉందో పట్టింపు లేదు.. కిడ్నీ ఆస్పత్రి ఆధునికీకరణ, వ్యాధిపై అధ్యయన అంశం ఎంత వరకు వచ్చిందో చెప్పే వారు లేరు. కానీ జిల్లా ఎమ్మెల్యేల ఘనత సరిహద్దులు దాటుతోంది. ప్రాజెక్టులు తీసుకువచ్చి, జిల్లాను అభివృద్ధి చేస్తే బాగుండేది. కానీ మన నేతలు తమ వ్యవహార శైలితో పార్టీకి, ప్రభుత్వానికే కాదు జిల్లాకు కూడా మచ్చ తీసుకువస్తున్నారు. ఒకరు కేజీబీవీ ఉద్యోగిని వేధించారంటూ రాష్ట్రవ్యాప్తంగా సంచలనమయ్యారు. ఇంకొకరి పైనైతే ఓ ఉన్నతాధికారి తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేశారు. ఇప్పుడు ఇంకో ఎమ్మెల్యే వంతు వచ్చింది. ఏకంగా తనపై హత్యాయత్నం చేశారంటూ ఓ అర్చకుడు నేరుగా రాష్ట్రపతికి, జాతీయ మానవ హక్కుల సంఘానికి మొరపెట్టుకున్నాడు.

న్యూస్‌రీల్

'వర్షాలు ఆలస్యం కావడంతో యూరియాకు డిమాండ్'



వ్యవసాయాధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: జిల్లాలో వర్షాలు ఆలస్యం కావడంతో యూరియాకు డిమాండ్ పెరిగిందని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గురువారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. పూర్తి స్థాయిలో ఎరువులు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం బఫర్ నిల్వగా ఉన్న 500 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు అందజేయాలన్నారు. జిల్లా అవసరాలకు తగిన విధంగా ఎరువులను తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం నిర్వహించిన గ్రీవెన్స్ విభాగంలో భాగంగా పలు వినతులు స్వీకరించారు. దివ్యాంగులకు పునః పరిశీలన పేరుతో విచారణ చేపట్టి పింఛన్లు తొలగిస్తున్నారంటూ పలువురు మంత్రికి విన్నవించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

బియ్యం ప్యాకెట్ల తూకాల్లో తేడాలు



బియ్యం ప్యాకెట్లు తూకం చూస్తున్న జిల్లా ఇన్‌స్పెక్టర్ చిన్నమ్మి

నరసన్నపేట: బియ్యం ప్యాకెట్ల తూకాల్లో తేడాలు ఉంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వినియోగదారులను వ్యాపారులు మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల జిల్లా ఇన్‌స్పెక్టర్ చిన్నమ్మి అన్నారు. కలెక్టర్‌కు ఈ మేరకు స్థానికులు ఫిర్యాదులు చేయగా గురువారం నరసన్నపేట, పోలాకి మండలాల్లో తనిఖీలు చేశామని ఒక కేసు నమోదు చేశామని ఆమె తెలిపారు. 26 కిలోల బియ్యం ప్యాకెట్లపై ముద్రించి 25 కిలోలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. దీనిపై నరసన్నపేట, పోలాకిలో మూడు కేసులు నమోదు చేశామన్నారు. నరసన్నపేటలో తనిఖీలు నిర్వహించగా పలు షాపులు మూసేశారని పేర్కొన్నారు.

వరద ముంపులో 600 ఎకరాలు



రావులవలస, ఈదుల వలస మధ్య నీట మునిగిన పంట పొలాలు

నరసన్నపేట: మండలంలో మూడు రోజుల కిందట కురిసిన వర్షాలకు వరి పంట పొలాలు నీట మునిగాయి. మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 600 ఎకరాల వరకు ముంపునకు గురైంది. సుందరాపురం, చిక్కాలవలస, మామిడి వలస, బొరిగివలస తదితర గ్రామాల్లో ఈ వరి పంట పొలాలు మునిగిపోయాయి. వారం కిందట ఇదే విధంగా మునిగిపోయాయి. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి తలెత్తడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేలకూలిన పూరిల్లు



కాపుగోపాలపురంలో నేలకూలిన పూరిల్లు

పాతపట్నం: మండలంలోని పాతపట్నం పంచాయతీ, కాపు గోపాలపురం గ్రామానికి చెందిన రేగేటి వజ్రమ్మకు చెందిన పూరిల్లు ఇటీవల కురిసిన వానకు కూలిపోయింది. బుధవారం రాత్రి సమయంలో వసంతమ్మ ఇంటిలో లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలియజేశారు. ఆ ఇంటిలో ఒక్క వజ్రమ్మ ఉంటుంది. గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. గురువారం గ్రామ రెవెన్యూ అధికారి (వీర్వో) కూలిన పూరిళ్ల పరిశీలించి, వివరాలు నమోదు చేసుకుని, ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వజ్రమ్మ వేడుకుంటోంది.

● ఆకారం.. తెలుగుపై మమకారం..



సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు 'అఆ' ఆకారంలో కూర్చున్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా భాషపై అవగాహన కోసం ఈ విధంగా కూర్చున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. - నరసన్నపేట



స్థానిక ఆదర్శ పాఠశాలలో తెలుగు వెలుగు ఆకృతిలో విద్యార్థులుకూర్చుకున్నారు. ఉపాధ్యాయులు కోట తిరుపతిరావు, ముగిడి దుర్గారావు, నారాయణ ఆధ్వర్యంలో ఈ విన్యాసం చేశారు. - జి.సిగడాం



వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని గురువారం టెక్కలి మండలం బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులంతా అ..ఆ అక్షరాల ఆకారంలో ప్రదర్శన చేశారు. - టెక్కలి

జాతీయ వాలీబాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక



సునీల్, గోపీచంద్


శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన ఇద్దరు వాలీబాల్ క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. గుజరాత్ రాష్ట్రంలోని నడియాడ్ వేదికగా ఈనెల 30 నుంచి సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు జరగనున్న 27వ జాతీయ బధిరుల వాలీబాల్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు జిల్లా నుంచి గుంటుకు సునీల్, సోపేటి గోపీచంద్ ఎంపికయ్యారు. సీనియర్స్ విభాగంలో వీరిద్దరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ఈ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి క్రీడామైదానంలో శిక్షణ పొందుతున్న వీరిద్దరూ ఇప్పటికే అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మెరిశారు. శ్రీకాకుళం నగరంలోని ఇందిరా నగర్‌కాలనీలో నివాసం ఉంటున్న సునీల్ ఇప్పటికే పదుల సంఖ్యలో బధిరుల జాతీయ పోటీలతోపాటు అర్జెంటీనా, జపాన్ దేశాల్లో జరిగిన అంతర్జాతీయ వాలీబాల్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి సిక్కోలు ఖ్యాతి చెప్పాడు. ఇతని తల్లిదండ్రులు గౌరీపతి, కృష్ణవేణి. రణస్థలం మండలం మహంతిపాలెం గ్రామానికి చెందిన సోపేటి గోపీచంద్ అనేక బధిరుల జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించి అదుర్స్ అనిపించాడు. 2017లో జాతీయ సబ్‌జూనియర్స్ పోటీల్లో పతకం సాధించాడు. గోపీచంద్ తల్లిదండ్రులు రామారావు, సుశీల.

నవోదయ దరఖాస్తు సవరణకు అవకాశం

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో(2025-26) విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తులను ఈనెల 30లోగా సవరణ చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ బేతనసామి గురువారం ప్రకటనలో వెల్లడించారు. ఈ సవరణల్లో జెండర్, సోషల్ కేటగిరీ, డిజేబులిటీ, మీడియమ్ వివరాలు మాత్రమే సవరణ చేస్తారని తెలిపారు. తల్లిదండ్రులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

● డీఎస్సీ నియామక ప్రక్రియలో

గందరగోళం



- అభ్యర్థికి తప్ప ఇంకెవరికీ తెలియని మార్కులు, ఎంపిక వివరాలు
- రాష్ట్రస్థాయిలోనే మెరిట్ కమ్ రోస్టర్ జాబితా

శ్రీకాకుళం:

రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నియామకాల ప్రక్రియకు సంబంధించి చేపడుతున్న విధానా లు గందరగోళంగా మారాయి. గతంలో అభ్యర్థుల మార్కులను ప్రకటిస్తూ మెరిట్ జాబితాను డీఈఓ కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచేవారు. అటు తర్వాత మెరిట్ కమ్ రోస్టర్ జాబితాను కూడా నోటీస్ బోర్డులో ఉంచేవారు. దీనిపై అభ్యంతరాలను స్వీకరించి, తుది జాబితాను విడుదల చేసి ధృవీకరణ పత్రాలు పరిశీలన జరిగేది. ఈ సారి అలాకాకుండా ప్రక్రియ అంతా రాష్ట్రస్థాయిలోనే జరుపుతున్నారు. బుధవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ, ఎంపికైన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా కాల్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకుని ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరవ్వాలని సూచించారు. రాష్ట్రస్థాయిలోనే ప్రక్రియ అంతా చేపట్టడం ఉమ్మడి రాష్ట్రాల చరిత్రలోనే తొలిసారి అని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. దీని వల్ల ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయి? మెరిట్ విధానంలో ఏవైనా తప్పులు జరిగాయా? రాష్ట్ర పాయింట్లలో పొరపాట్లు దొర్లాయా? అనేది పరిశీలించేందుకు అవకాశం లేకుండా పోయిందని ఉపాధ్యా య సంఘాలతో పాటు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారదర్శకంగా జరగాల్సిన ప్రక్రియను ఇలా గోప్యంగా చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి కూడా ఎలాంటి సమాచారం లేకపోవడంతో అభ్యర్థుల సందేహాలను సైతం నివృత్తి చేయలేని పరిస్థితుల్లో వారు ఉన్నారు. 403 మందిలో ఎవరు ఏ పోస్టుకు ఏ పాఠశాలకు ఏ కేటగిరీకి ఎంపికయ్యారో కూడా తెలియడం లేదు. కొందరు అభ్యర్థులు రెండు నుంచి మూడు పోస్టులకు ఎంపిక కావడంతో ధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం అభ్యర్థుల నుంచి కావాల్సిన పోస్టు వివరాలను తెలుసుకొని ఆ అభ్యర్థి వదులుకున్న పోస్టులకు అటు తర్వాత ర్యాంకుల వారికి కాల్ లెటర్లు పంపిస్తారని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అది కూడా తమకు రాష్ట్రస్థాయి నుంచి అందిన మౌఖిక సమాచారం అని వారు చెబుతున్నారు. ఇందులో వాస్తవం ఎంత అన్నది కూడా కచ్చితంగా చెప్పలేకపోతున్నారు.

కేజీబీవీ పీఈటీలపై అభ్యర్థుల ఫిర్యాదు

జిల్లాలోని కేజీబీవీలో పీఈటీలుగా పనిచేస్తూ డీఎస్సీ నుంచి పీఈటీలుగా ఎంపికైన వారిపై కొందరు అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. ఎంపికైన పీఈటీలు కేజీబీవీలో పనిచేస్తూనే పీఈటీ శిక్షణ పూర్తి చేసిన ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకున్నారని, రెండు చోట్ల ఒకేసారి చేయడం ఎలా సాధ్యపడిందని వారు జిల్లా విద్యాశాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయికి నివేదిస్తానని డీఈఓ తెలిపారు.

పూర్తిస్థాయి డీఈఓ లేకుండానే..

జిల్లాకు పూర్తిస్థాయి డీఈఓ లేకుండా కీలక పనులు జరిగిపోతున్నాయి. ఇప్పటికే చాలా ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోయాయి. దీనిపై డీఎస్సీ అభ్యర్థుల్లోనూ ఆందోళన కనిపిస్తోంది. రాజకీయ కారణాల వల్లే కొత్త డీఈఓను నియమించలేదని తెలుస్తోంది.



ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

తొలి రోజు 403 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో తొలి రోజు గురువారం 403 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. వాటిని రాష్ట్రస్థాయికి ఆన్‌లైన్ ద్వారా నివేదించారు. అన్ని యాజమాన్యాల పా ఠశాలలకు సంబంధించి మొత్తం 543 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 403 మందికి మాత్రమే కాల్ లెటర్స్ రావడంతో వారంతా పత్రాల పరిశీలనకు వచ్చారు.



శ్రీకాకుళం చల్లవీధిలో ఆపరేషన్ సింధూర్ వినాయకుడు



ఆమదాలవలస: పాలపోలమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ వినాయక మండపం



జిల్లా కేంద్రంలోని రైతు బజార్ వద్ద ఏర్పాటు చేసిన వారాహిమాత ఒడిలో గణేశుడు

● ఏక దంతాయ విద్మహే..


ఏక దంతుడు అనేక రూపాల్లో కొలువు దీరాడు. ఊరూరా వెలసిన భారీ మండపాల్లో తీరొక్క రూపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు వైభవంగా పూజాదులు నిర్వహించారు.



రణస్థలం: గరికిపాలెంలో ప్రతిష్ఠించిన 12 అడుగుల విగ్రహం



కవిటి: బొరివంకలో ఏర్పాటు చేసిన కదంబ గణపతి



కంచిలి మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన 21 తలల విఘ్నేశ్వరుడు

క్లుప్తంగా

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రాపురం రైల్వే స్టేషన్ సమీపంలో బండిపేట వద్ద రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. తల చితికిపోయి గుర్తుపట్టనివిధంగా మారింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు కోటబొమ్మాళి మండలం సరియా బొడ్డపాడు గ్రామానికి చెందిన చాప రాములు(67)గా గుర్తించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.. ఆత్మహత్య అనే విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

రణస్థలం: రణస్థలం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బుడుమూరు శిరీష(22) అనే మహిళ మృతి చెందింది. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 10.15 గంటల సమయంలో సూర్య స్కూల్ జంక్షన్‌లో ఆటో మలుపు తిప్పుతుండగా డివైడర్‌ను ఢీకొట్టి ఆటో బోల్తాపడింది. అందులో కూర్చున్న శిరీష బయటకు తుళ్లిపడగానే విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినది. శిరీష తన భర్తతో గొడవల నేపథ్యంలో మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేద్దామని వచ్చింది. ఈ క్రమంలో జె.ఆర్.పురం పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో అమ్మమ్మ ఇంటి వద్ద మాట్లాడి తిరిగి స్వగ్రామం లావేరు మండలం పాతకుంకాం వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆటోలో ఉన్న మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై ఎస్.చిరంజీవి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతి చెందిన ప్రభాస్

రణస్థలం: జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలస సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు యువకుడు కేటీఎం బైక్‌పై జే.ఆర్.పురం థియేటర్ వైపు నుంచి సీతంవలస మీదుగా లావేరు వెళ్తుండగా శ్మశానం మలుపు వద్ద గురువారం రాత్రి 9 గంటల సమయంలో అదుపుతప్పి పడిపోయారు. బైక్ నడుపుతున్న వనుము ప్రభాస్(20) బైక్ ముందు పెట్రోల్ ట్యాంక్‌ను బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న రాంబాబు తుప్పల్లోకి తుళ్లిపోయి గాయాలతో బయటపడ్డాడు. మృతుడు ప్రభాస్‌ది లావేరు మండలం సుభద్రాపురం. తల్లిదండ్రులు చిట్టిబాబు, సత్యవతి, సోదరుడు ఉన్నాడు. గాయపడిన రాంబాబు స్వగ్రామం మురపాక. ఇద్దరూ గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై ఎస్.చిరంజీవి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు తీస్తున్న ఆఫ్‌షోర్ కాలువ ఇదే



ప్రాణాలు పోతున్నాయ్!

- ప్రమాదకరంగా ఆఫ్‌షోర్ కాలువ
- లోతు తెలియక ఈతకు దిగుతున్న యువత
- స్నానానికి వెళ్తూ మృత్యువాత పడుతున్న ప్రజలు
- కానరాని హెచ్చరిక బోర్డులు

మెళియాపుట్టి :

ఆఫ్‌షోర్ కాలువ ప్రమాదకరంగా మారింది. రేగులపాడు రిజర్వాయర్‌కు అనుసంధానంలో భాగంగా మెళియాపుట్టి మండలంలోని పట్టుపురం, జోడూరు, రాజపురం, అచ్చనాపురం తదితర గ్రామాలకు ఆనుకుని ఆఫ్‌షోర్ కాలువను 2008–09లో తవ్వారు. సుమారు50 అడుగుల లోతున్న ఈ కాలువ మృత్యుకాలువగా మారింది. దీని లోతు తెలియక స్నానాలకు దిగి ఈతరాక ఎంతోమంది మృత్యువాతపడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదు. కాలువ చుట్టుపక్కల ఎక్కడా ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు. దీంతో అమాయకులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. 2018లో చిన్ననీలాపురం గ్రామానికి చెందిన కొల్లి తారకేశ్వరరావు ఇదే కాలువలో స్నానానికి దిగి మృతిచెందాడు. మూడురోజుల తర్వాత మృతదేహం లభ్యమైంది. 2019 మే 10న మారడికోట గ్రామదేవత ఉత్సవాలకు స్నేహితుని ఇంటికి వచ్చిన హైదరాబాద్ యువకుడు మొహద్దీన్ ఈత సరదాతో కాలువలో దిగి మృత్యువాత పడ్డాడు. తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నా చాలావరకు వెలుగుచూడటం లేదు. కాలువలో నిత్యం నీరు ఉండటంతో తమ మాట వినకుండా యువకులు స్నానాలకు వెళుతున్నారని, దీంతో ఎప్పుడు ఎటువంటి వార్త వినాల్సి వస్తుందోనని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


జోడూరు సమీపంలో హెచ్చరిక బోర్డులు లేకుండా దర్శనమిస్తున్న కాలువ

త్వరలోనే ఏర్పాటు చేస్తాం



పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో కాలువ లోతు నిర్ధారించలేం. అందుకే ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. త్వరలోనే ఏర్పాటు చేస్తాం. గ్రామాలలో పర్యటించిన సమయాల్లో సైతం యువతను అప్రమత్తం చేస్తున్నాం. ప్రమాదాలు జరకుండా చర్యలు తీసుకుంటాం

– రాజశేఖర్, వంశధార ఈఈ, టెక్కలి

నా పరిస్థితి ఎవరికీ రాకూడదు..



2018లో నా భర్త తారకేశ్వరరావు ఆఫ్‌షోర్ కాలువలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. మూడురోజుల పాటు కనిపించకపోవడంతో పిల్లలతో నరకం అనుభవించాను. మూడో రోజు శవమైతేలాడు. నా కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. నాలాంటి పరిస్థితి ఇంకెవరికీ రాకూడదు. నిత్యం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన యువకులు స్నానాలకు కాలువ ప్రదేశానికి వెళుతుంటారు. అధికారులు స్పందించి ఏవైనా సూచికలు ఏర్పాటు చేసి ఉంటే అలా జరిగేది కాదు. – కొల్లి గుణలక్ష్మి, చిన్ననీలాపురం, మెళియాపుట్టి మండలం

ప్రాణాలు తీస్తున్న ఈత సరదా..



చాలామంది కాలువలో ఈతకు దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. కాలువ ఎంత లోతుందో తెలియక స్నానాలకు దిగుతున్నారు. గ్రామాలకు ఆనుకుని ఉండటంతో పంటపొలాల్లో పనులు చేసుకుని ఇంటికివచ్చే క్రమంలో రైతులు అదే కాలువలో స్నానాలు చేస్తున్నారు. ఏమాత్రం కాలు జారినా ప్రాణాలు దక్కవు. అధికారులు పట్టించుకోవాలి.

– సవర సూరయ్య, అచ్చనాపురం

నిమజ్జనం.. సురక్షితం..

- భక్తులకు రక్షణగా 'లైఫ్ సేవింగ్' బృందం
- అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సేవలు


భక్తులు నదిలోకి వెళ్లకుండా రోప్ పార్టీగా ఏర్పడిన లైఫ్ సేవింగ్ బృందం

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం కల్చరల్: గణపతి నిమజ్జనోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర, జాతీయ స్థాయి స్విమ్మర్లతో కూడిన లైఫ్ సేవింగ్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా బృందం తనవంతు సేవ చేస్తోంది. లైఫ్ సేవింగ్ నేషనల్ మెడలిస్ట్ షేక్ సుభాన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రశాంతంగా నిమజ్జనోత్సవాలను చేపడుతున్నారు. శ్రీకాకుళం ఉమా రుద్ర కోటేశ్వర ఆలయం వద్ద గణపతి నిమజ్జనాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లైఫ్ సేవింగ్ బృందం నిర్వహిస్తున్నారు. పాలిథిన్ కవర్లు, గోనెసంచులు వేయకుండా భక్తుల చేతనే డస్ట్ బిన్స్‌లో వేయించి నది కలుషితం కాకుండా చేస్తున్నారు. రెండురోజులు భారీ వర్షాలతో నాగావళి నదికి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో.. భక్తులు లోనికి రాకుండా రోప్‌గా ఏర్పడి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సుభాన్‌తోపాటు లైఫ్ సేవింగ్ ప్రతినిధులు స్వామి లక్ష్మణ్, అప్పన్న, రాజేష్, ఈసుశ్రీ, సత్తిరాజు, సహదేవుడు తదితరులు సేవలు అందిస్తున్నారు. గత కొన్నేళ్లగా లైఫ్ సేవింగ్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం సమయంలో భక్తుల సహాయార్థం సేవలు అందిస్తున్నట్టు స్విమ్మర్లు తెలిపారు. వీరి సేవలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రజాప్రతినిధులు, సంఘ ప్రతినిధులు సైతం ప్రశంసిస్తున్నారు.

ఫిషింగ్ హార్బర్ స్థల పరిశీలన


ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐసీఈఎఫ్ బృందం

ఎచ్చెర్ల : బుడగట్లపాలెం సముద్రతీర ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని గురువారం సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోస్టల్, ఇంజినీరింగ్ ఫర్ ఫిషరీ (సీఐసీఈఎఫ్) బెంగళూరు బృందం సాధారణ పరిశీలన చేపట్టింది. కాకినాడ వద్ద ఉప్పాడ ఫిషింగ్ హార్బర్‌ను తనిఖీకి వచ్చిన వీరు బుడగట్లపాలెం హార్బర్‌ను కూడా పరిశీలించారు. గతంలో చేసిన ప్రతిపాదనల్లో మార్పులు చేపడుతూ డబ్ల్యూ.ఏపీ.సీవోసీ పంపిన ప్రతిపాదనలకు అనుగుణంగా ఇక్కడ పనులకు సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు నూతన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో సీఐసీఈఎఫ్ డైరెక్టర్ ఎస్.రవిశంకర్, డాక్టర్ బెలియప్ప, ఏపీ మేరీ టైంబోర్డ్ ఎస్ఈ నగేష్, మత్స్యశాఖ డీడీ వై.సత్యనారాయణ, ఎఫ్‌డీవో రవికుమార్, సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, ఎంఎఫ్‌సీఎస్ సొసైటీ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీరాములు, వైస్ ప్రెసిడెంట్ యు.అప్పన్న, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త హత్యకేసులో ముగ్గురికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ : గతేడాది ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కూన ప్రసాద్‌ను టీడీపీ మద్దతుదారులు దారి కాచి దాడి చేయడంతో మరణించిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి అప్పట్లో ఎచ్చెర్ల పోలీసులు ఎఫ్ఐఆర్‌లో తొమ్మిది మందిని చేర్చి నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా మరో ముగ్గురు శీపాన శివకుమార్, కొత్తకోట సాయి, జమ్మి వేణులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ పేర్కొన్నారు.

చోరీ కేసులో ముద్దాయికి జైలుశిక్ష

కొత్తూరు : నివగాం గ్రామంలోని సీతారామ మోడరన్ రైస్ మిల్లులో 2020లో భామిని మండలం బిల్లమడ గ్రామానికి చెందిన రాగోలు బాలకృష్ణ రూ. 20 వేలు చోరీ చేశాడు. నేరం రుజువు కావడంతో ముద్దాయి బాలకృష్ణకు రెండేళ్ల జైలు శిక్ష, రూ. పది వేలు జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.రాణి తీర్పునిచ్చారని ఎస్ఐ చెప్పారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు అన్నారు. చిన్న తనంలో పెళ్లి చేస్తే ఆడపిల్లలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. ఈ మేరకు గురువారం సింగుపురంలో బాల్య వివాహాలు కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. 18 ఏళ్లు రాకుండా వివాహాలు చేస్తే 15100 అనే నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పీఎస్ఐ మెంబర్ వెంకటేష్, అడ్వకేట్ ఇందిరాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యపై పట్టు సాధించాలి


ప్రాజెక్ట్‌లను తిలకిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎచ్చెర్ల : విద్యార్థులు సాంకేతిక విద్యలో నైపుణ్యతను సాధించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటీశాఖ మార్గదర్శకత్వంలో అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాక్‌థాన్ 2025లో భాగంగా గురువారం ఎచ్చెర్లలోని రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ(ట్రిపుల్ ఐటీ)లో అంతర్గత హ్యాక్‌థాన్ నిర్వహించింది. క్వాంట్ కీ డిస్ట్రిబ్యూషన్ (బీబీ84 ప్రోటోకాల్), క్వాంటం స్టేట్ విజువలైజర్, సూపర్‌డెన్స్ కోడింగ్ ప్రోటోకాల్ వంటి వినూత్న ప్రాజెక్ట్‌లను విద్యార్థులు ప్రదర్శించారు. ఇందులో ఎంపికైన బృందాలు అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాక్‌థాన్ 2025 తదుపరి రౌండ్లలో శ్రీకాకుళం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారి వినూత్న ఆలోచనలను అభినందించారు. క్వాంట్ సాంకేతికతలతో జాతీయ రక్షణ, నావిగేషన్, సముద్ర పరిశోధనలకు అనువైన మార్గాలను అన్వేషించడానికి ఆర్జీయూకేటీ ముందడుగు వేయడం అభినందనీయమన్నారు. క్వాంట్ టెక్నాలజీ ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ జాతీయ రక్షణ, నావిగేషన్, సముద్ర అధ్యయనాలకు సంబంధించి క్వాంటం సెన్సింగ్ ఫర్ మెరైన్ అప్లికేషన్‌ను పరిశోధన, ఆవిష్కరణల కోసం ఎంచుకుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి అండర్ గ్రాడ్యుయేట్ క్వాంటం విద్యను బలోపేతం చేయడానికి క్వాంటం టెక్నాలజీస్‌లో మైనర్ డిగ్రీని 480 మంది విద్యార్థులు ఎంపిక చేసుకున్నారు. అదనంగా ప్రత్యేక మైనర్ ల్యాబ్‌లు ఏర్పాటుకోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ)కి ప్రతిపాదన సమర్పించినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ ఎం.శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి సీహెచ్ వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, సీఎస్ఈ విభాగాధిపతి వై.రమేష్, పీఆర్ఓ మామిడి షణ్ముఖరావు, సహాయాచార్యులు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై నడవలేకపోతున్నాం


నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కొత్తూరు: కుంటిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సిరుసువాడ గ్రామ విద్యార్థులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామం నుంచి కుంటిభద్రకు వెళ్లేందుకు రహదారి బురదగా మారడంతో నడవలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు నిలిచిపోవడంతో సైకిల్ వెళ్తూ జారిపడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరాచరు. కాగా, కుంటిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట రుచికరంగా వండటం లేదంటూ విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు.

ప్రాణహాని ఉంది..రక్షణ కల్పించండి


తలగాన నరసింహమూర్తి

పలాస: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషాకు సన్నిహితుడు, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని తెలుగుదేశం పార్టీ పలాస నియోజకవర్గ అధికార ప్రతినిధి, పెదంచల గ్రామానికి చెందిన తలగాన నరసింహమూర్తి గురువారం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 26న తాను మద్యం సేవించి పీరుకట్ల విఠల్, పోలాకి పాపారావులను దుర్భాషలాడానని పోలీసు స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేశారని, ఫలితంగా కాశీబుగ్గ పోలీసులు తనను పిలిపించి హెచ్చరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మద్యం తాగే అలవాటు లేదని, నేను వారిని ఎప్పుడూ ఎక్కడా దుర్భాషలాడలేదని స్పష్టం చేశారు. అయినా తనను తప్పుడు కేసుల్లో ఇరికించాలని చూస్తున్నారని, భవిష్యత్తులో తన చేతిలో గంజాయో ఏ ఇతర మత్తు పదార్థాలు ఉన్నాయని కూడా కేసు పెట్టవచ్చని సందేహం వ్యక్తం చేశారు. పీరుకట్ల విఠల్‌రావు నుంచి తనకు రక్షణ కల్పించాల వేడుకున్నాడు.

ఎట్టకేలకు కొనసాగింపు ఉత్తర్వులు


ధర్మాన కృష్ణదాస్ చేతుల మీదుగా ప్రొసీడింగ్స్ అందుకుంటున్న నక్క తులసీదాస్

సారవకోట: డీఎల్‌డీఏ చైర్మన్‌కు సంబంధిత అధికారులు ఎట్టకేలకు ఈ నెల 26న ఉత్తర్వులు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. గత ప్రభుత్వ హయాంలో సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన నక్క తులసీదాస్‌ను జిల్లా లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్‌కు 2023 డిసెంబర్ 4న ఏకగ్రీవంగా ఏజెన్సీ సభ్యులు ఎన్నుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నామినేటెడ్ పోస్టుల్లోఉన్న వారిని రాజీనామా చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొందరు డీఎల్‌డీఏ చైర్మన్లు హైకోర్టును ఆశ్రయించారు. వీరికి అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చింది. అయినప్పటికీ మన జిల్లాలో కూటమి ప్రభుత్వ పెద్దలు అడ్డుపడటంతో సంబంధిత శాఖాధికారులు కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వలేదు. ఎట్టకేలకు కలెక్టర్ సూచనల మేరకు మంగళవారం రాత్రి ఉత్తర్వులు అందజేశారు. గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా మబగాంలో ప్రొసీడింగ్ పత్రాలను తులసీదాస్ అందుకున్నారు.

మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం


అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన తెలియజేస్తున్న వామపక్ష నేతలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యుత్ పోరాటంలో అమరవీరుల స్ఫూర్తితో మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. 2000లో చంద్రబాబు నాయుడు తెచ్చిన విద్యుత్ సంస్కరణకు వ్యతిరేకంగా విద్యుత్ పెంపుదలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో బషీర్‌బాగ్ కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామికి గురువారం నివాళులర్పించారు. అనంతరం విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినం శ్రీకాకుళం అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిర్వహించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సీపీఎం నాయకులు బి.కృష్ణమూర్తి, కె.మోహనరావు, పి.తేజేశ్వరరావు, ఆర్.ప్రకాష్‌రావు, ఎం.గోపి, కె.సూరయ్య, పాణి గ్రహి, ఎం.లక్ష్మి, శ్రీదేవి, డి.గణేష్, ఎస్.కృష్ణవేణి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ నియామకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో జిల్లాకు చెందిన పలువురు నాయకులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించారు. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.


ముద్దాడ గోవింద విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరసన్నపేట


సుగ్గు రామిరెడ్డి రైతు విభాగం కార్యదర్శి టెక్కలి


పొన్నాడ రుషేశ్వరావు ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాకుళం


మహ్మద్ అబ్దుల్ సిరాజ్ మైనార్టీసెల్ సంయుక్త కార్యదర్శి, నరసన్నపేట


షేక్‌ఖాన్ బాషా మైనార్టీసెల్ సంయుక్త కార్యదర్శి ఎచ్చెర్ల


అత్తులూరి రవికాంత్ వలంటీర్ విభాగం కార్యదర్శి, ఆముదాలవలస


పైడి రాణాప్రతాప్, వలంటీర్ విభాగం రాష్ట్రకార్యదర్శి, ఆముదాలవలస


పైడి నాగభూషణరావు కల్చరల్ విభాగం కార్యదర్శి ఆముదాలవలస


నడుపల్లి పైడయ్య కల్చరల్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, నరసన్నపేట


జరుగుళ్ల శంకరరావు బూత్ కమిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల


అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు బూత్‌కమిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి, ఆముదాలవలస


దుంపల శ్యామలరావు బూత్ కమిటీ సంయుక్త కార్యదర్శి, ఆముదాలవలస

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

వజ్రపుకొత్తూరు రూరల్: గోపాలపురం గ్రామానికి చెందిన రైతు యవ్వారి వైకుంఠరావు (50) గురువారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైకుంఠరావు గురువారం రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా షాక్ కొట్టడంతో మృతి చెందారు. కాసేపటికి స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన వైకుంఠరావు